# అభివృద్ధే మా ఆయుధం

- చెడుపై మంచి గెలుపే విజయదశమి
- విపక్షాల కుట్రలను ఛేదించి సీఎం కేసీఆర్ గెలిచి నిలిచాడు
- పోరాడి సాధించిన తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపాడు
- పదేండ్లలోనే వందేండ్ల అభివృద్ధి చేసిండు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి దంపతులు


ప్రచార రథానికి పూజలు చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 24 : చెడుపై మంచి గెలుపే విజయదశమి అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయదశమిని పురస్కరించుకుని సూర్యాపేటలోని జమ్మిగడ్డలో నిర్వహించిన వేడుకల్లో అలాగే మంగళవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన దసరా వేడుకలో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొని జమ్మి పూజలు నిర్వహించి ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెడుపై మంచిని బతికించాలనే సంకల్పంతో పాండవులు జమ్మిచెట్టు వద్ద ఆయుధ పూజలు చేసి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. అదే మాదిరిగా 14 ఏండ్లు ఉద్యమం చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిరంతర అభివృద్ధి పాలనే ఏకైక ఆయుధంగా భావించి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు. 60 ఏండ్లకు పైగా పాలించిన ఉమ్మడి పాలకుల హయాంలో అన్ని విధాలుగా ఆగమైన తెలంగాణ ప్రాంతాన్ని అతి తక్కువ సమయంలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతున్నదన్నారు. ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, నిరంతర విద్యుత్, తాగు, సాగునీరు ఇలా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని నేడు యావత్ దేశం నమ్ముతున్నదన్నారు.

ఉమ్మడి పాలకుల హయాంలో సూర్యాపేటలో జరిగిన పండుగ వేడుకలు, గత పదేండ్లుగా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న వేడుకలకు తేడాను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లోనూ ఇలాంటి ప్రశాంత వాతావరణంలో మరింత అభివృద్ధి సాధించుకుందామన్నారు.

# సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- బీఆర్‌ఎస్ నాంపల్లి మండలాధ్యక్షుడు నర్సింహరావు

నాంపల్లి, అక్టోబర్ 24 : మునుగోడులో గురువారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గుమ్మడపు నర్సింహరావు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మునుగోడు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఈ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే విధంగా బీఆర్‌ఎస్ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు

# సూర్యాపేట వైస్ ఎంపీపీపై బీరు సీసాతో దాడి

- దసరా వేడుకల్లో ఘటన
- కాంగ్రెస్ నాయకుల అనుచరులేనని బాధితుడు శ్రీనివాస్‌నాయుడు పోలీసులకు ఫిర్యాదు

సూర్యాపేట, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడుపై సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారు. బీరు సీసాతో తలపై మోదడంతో గాయాలయ్యాయి. ఆ సమయంలో నాయుడు అనుచరుడు ఒకరు గుర్తించి చేయి అడ్డుపెట్టడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇటీవల ఓ ఎలక్ట్రానిక్ మీడియా చానల్ వారు నిర్వహించిన చర్చా వేదికలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పచ్చి బూతులు తిట్టుకున్నారు. అక్కడ తాను లోకల్.. బయటి నుంచి ఇక్కడ రాజకీయం ఎంట్రా.. ఎవర్నీ వదలా.. ఒక్కొక్కడి అంతు తేలుస్తా అంటూ రెచ్చిపోయిన నాయకుడి అనుచరులే వైస్ ఎంపీపీపై దాడికి పాల్పడ్డట్లు స్థానికులు, బీఆర్‌ఎస్ శ్రేణులు తెలుపుతున్నాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో దసరా వేడుకల సందర్భంగా తన అభిమానులతో కలిసి పూజలు చేసే ప్రదేశంలో నిలబడి ఉండగా వెనుక నుంచి ఓ వ్యక్తి ఒక్కసారిగా బీరు సీసాతో తలపై దాడి చేసినట్లు చెప్పాడు.

పక్కనే ఉన్న వ్యక్తి దాడిని గుర్తించి చేయి అడ్డుపెట్టగా స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు తెలిపాడు. పగిలిన సీసా పెంకుతో మరోమారు దాడికి పాల్పడబోగా పక్కకు నెట్టి అక్కడి నుంచి వెళ్లినట్లు వివరించారు. అనంతరం కొంత దూరం వెళ్లిన తర్వాత చేయి అడ్డుపెట్టిన వ్యక్తిని పట్టుకుని మళ్లీ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని, పురిగొల్పిన వారిని గుర్తించి శిక్షించాలని కోరారు. ఈ విషయమై సూర్యాపేట రూరల్ సీఐ అశోక్‌రెడ్డిని వివరణ కోరగా బాలెంల దాడి ఘటనపై ఫిర్యాదు అందిందని, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

# వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

కట్టంగూర్, అక్టోబర్ 24 : దేవీ శరన్నవరాత్సోవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గాదేవి నిమజ్జన వేడుకలను మంగళవారం నిర్వహించారు. కట్టంగూర్, ఈదులూరు, పరడ, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల గ్రామాల్లో దుర్గాదేవి శోభయాత్రను డప్పుచప్పుళ్ల మధ్య నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, ముడుసు భిక్షపతి ముడుసు గోవర్ధన్, రవి, సంతోష్‌రెడ్డి, శంకర్, ముడుసు శ్రీశైలం, రాహుల్, కృష్ణంరాజు, యాదగిరి పాల్గొన్నారు.


చౌటుప్పల్ : అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళా భక్తులు,పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

## దుర్గామాతకు ఒడి బియ్యం

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణంలోని సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవీ విగ్రహం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. విగ్రహా ఉద్వాసన పూజ చేపట్టారు. అనంతరం అమ్మవారికి నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ చెర్మన్ బత్తుల శ్రీశైలం, దేవస్థానం అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేశ్ గౌడ్, ఆలయ కమిటీ మాజీ ధర్మకర్త మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు ..

రామగిరి : పలు దేవాలయాలతోపాటు జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు, భవానీ దీక్ష స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. మాలధారులు దీక్ష విరమించారు.పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు. నవ రాత్రులు పూజలందుకున్న అమ్మవారి శోభయా త్ర బుధవారం నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, తీన్మార్ స్టెప్స్, కోలాట ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గురువారం నిమజ్జనం చేయనున్నారు.


కట్టంగూర్ : మునుకుంట్లలో దుర్గామాత ఊరేగింపు


మునుకుంట్లలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

# ఆకట్టుకున్న ఆర్యసమాజ్ శోభాయాత్ర


ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శోభాయాత్రలో పాల్గొన్న నిర్వాహకులు

రామగిరి, అక్టోబర్ 24 : దసరా విశిష్టతను తెలిపేలా ఆర్యసమాజ్-నల్లగొండ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాల్‌బౌలి(పాతబస్తీ)షేర్‌బంగ్లా ఆర్యసమాజ్ నుంచి రామగిరిలోని ఆర్యసమాజ్ వరకు ఓం ధ్వజ శోభాయాత్రను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. అంతకు ముందుకు ఆయుధ పూజ చేసి ఓం జెండాను ఆర్యసమాజం నిర్వాహకులు ప్రముఖులతో కలిసి ఎగురవేశారు. శోభాయాత్రలో చిన్నారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

## వాణిజ్య ప్రగతికి రవాణా వ్యవస్థ దోహదం :కర్నల్ శ్రీనివాస్

మునగాల, అక్టోబర్ 24 : వ్యాపార, వాణిజ్య అభివృద్ధికి రవాణా వ్యవస్థ ఎంతగానో దోహద పడుతున్నదని విజయరాఘవపురం గ్రామ వాసి కర్నల్ సుంకరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో డీసీఎం వాహనాల యజమానులు ఏర్పాటు చేసిన మునగాల మండల మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు రవాణా ద్వారా సరుకు ఎగుమతి, దిగుమతి చేయడంలో మినీ లారీలు ఎంతో ప్రాధాన్యను పోషిస్తాయన్నారు. కమిటీ సభ్యులు, యజమానులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కర్నల్ శ్రీనివాస్

## మద్యం పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబర్ 24 : మండలంలోని కాపుగల్లులో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై రైడ్ చేసి మద్యం పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో 14 క్వార్టర్లు, 2 బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

## ఆర్థిక సాయం

కోదాడ రూరల్, అక్టోబర్ 24 : పట్టణ పరిధి కోమరబండకు చెందిన ఎస్‌కె మజీద్ మృతిచెందాడు. తనతో పాటు చదువుకున్న 1997–98 బ్యాచ్ స్నేహితులు మంగళవారం రూ.21,500 ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపేందర్, మామిడి రామారావు, దాసరి జయసూర్య, బత్తుల లింగరాజు, పసుపులేటి అంజిబాబు, కాలతిరిపి కృష్ణ, దేవపంగు ధనమూర్తి, గూడూరు చెన్నారాయుడు, ఎస్‌కె జాని, సంపేట ఉపేందర్, చక్రవర్తి, లక్ష్మయ్య, మద్దెల వెంకన్న పాల్గొన్నారు.